క్లుప్తంగా

పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు అందుకున్న పెద్దమ్మ తల్లి

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ దేవత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి దేవమ్మ అమ్మవారి మూల విరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బీఎస్‌ఎఫ్ కవాతు

గాండ్లపెంట: ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం తుమ్మలబైలు, గరుగుతండా, గజ్జలవాండ్లపల్లి గ్రామాల్లో ఆదివారం ఎస్‌ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్‌ఎఫ్) దళాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పోలీసులు, బీఎస్‌ఎఫ్ సిబ్బంది చే కార్డన్‌సెర్చ్ చేశారు. ఎస్‌ఐతో పాటు హెడ్‌కానిస్టేబుళ్లు రామయ్య, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం



ఫుట్‌బాల్ క్రీడాకారులను సత్కరిస్తున్న జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

హిందూపురం టౌన్: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక జేవీఎస్ ఫంక్షన్ హాలులో అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఏర్పడిందన్నారు. అనతి కాలంలోనే క్రీడాకారులు జాతీయ పోటీల్లోనూ రాణించడం హర్షణీయమన్నారు. అనంతరం ప్రతిభ చూపిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్షాద్ అలీ, కోశాధికారి శేఖర్, కార్యదర్శి మహమ్మద్ సలీమ్, ఈసీ మెంబర్లు విజయవాణి, సీనియర్ క్రీడాకారులు శ్రీనివాసరెడ్డి, ఆజాద్, ఆర్‌డీటీ ఫుట్‌బాల్ కోచ్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలో ఉన్న కొట్నూరు సమీపంలో అధిక లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ ఆదివారం బోల్తా పడింది. పెనుకొండ వైపు నుంచి బెంగళూరు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అయితే అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయట పడ్డారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు వెంటనే క్లియర్ చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



నగదు, వాహనాలను చూపుతున్న పోలీసులు

లేపాక్షి: మండలంలోని కుర్లపల్లి గ్రామ సమీపంలో ఆదివారం ఎస్‌ఐ గోపి ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,300తో పాటు మూడు ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆపన్నహస్తం



నరసింహులు భార్యకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: తమతో పాటు చదువుకున్న ఓ మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన నరసింహులు కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మిత్రులంతా చందాలు వేసుకుని సేకరించిన రూ.50 వేల ఆర్థికసాయాన్ని మృతుడి భార్య మంజులకు అందజేశారు. అనంతరం చెన్నేకొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పది వేల రూపాయల విలువైన కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్‌ఎస్ రాయుడు, ఆదినారాయణరెడ్డి, గాయత్రి, సతీష్, ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చౌటకుంటపల్లి, కొండకమర్లలో టీడీపీకి షాక్

- వైఎస్సార్‌సీపీలో ముస్లిం, బీసీ నాయకుల చేరిక



కొండకమర్లకు చెందిన ముస్లిం మైనార్టీలతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన చౌటకుంటపల్లి వాసులతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఓడీచెరువు మండలం కొండకమర్ల, నల్లమాడ మండలం చౌటకుంటపల్లిలో టీడీపీ షాక్ తగిలింది. ఆయా గ్రామాలకు చెందిన పలువురు ముస్లిం, బీసీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పుట్టపర్తిలో ఎమ్మెల్యే కార్యాలయంలో వీరందరికీ ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండకమర్లకు చెందిన ముస్లిం నేతలు మాట్లాడుతూ సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆకర్షించడంతో పార్టీలో చేరామన్నారు. బీజేపీతో టీడీపీ, జనసేన అనైతిక పొత్తు పెట్టుకోవటం దారుణమన్నారు. టీడీపీ కూటమికి గట్టిగా బుద్ధి చెబుతామని వారు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన సాధికుల్లా, హైదరుల్లా, అమార్, అబ్దుల్, రవూఫ్, ముజీబ్, ఖాదర్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

చౌటకుంటపల్లిలో ..

నల్లమాడ మండలం చౌటకుంటపల్లికి చెందిన పలువురు బలహీన వర్గాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం గ్రామంలో వీరందరికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శాంతమ్మ, వినోద్, వెంకట్రాముడు, నాగమ్మ, జనార్దన్, పార్వతీ, బండి వెంకట్రాముడు, చిన్నాగమ్మ, తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. తాము వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత చౌటకుండపల్లి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగని 'పల్లె' గిమ్మిక్కులు

ఓడీచెరువు : టీడీపీ నేత పల్లె రఘునాథరెడ్డి గిమ్మిక్కులు కొనసాగిస్తున్నారు. తన పార్టీ వారికే కండువాలు కప్పుతూ టీడీపీలో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఆయన తీరుపై సొంత పార్టీ శ్రేణులే మండిపడుతున్నాయి. ప్రజాదరణ లేక ఇలాంటి గిమ్మిక్కులు చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. తాజాగా ఆదివారం ఓడీచెరువు మండల పరిధిలోని సున్నంపల్లి పంచాయతీ పెద్దగుట్లపల్లిలో 71 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ఎల్లో, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకున్నారు. వాస్తవానికి ఇక్కడ తెలుగుదేశం పార్టీలో ఉన్న వారికే మళ్లీ కండువాలు కప్పి పార్టీలో చేరినట్లుగా చూపారు. ఇలాంటి గిమ్మిక్కులు పల్లెకు కొత్త కాదని, రానురాను ఇవి మరింత పరాకాష్టకు చేరుకుంటాయని ఆ పార్టీ శ్రేణులే అంటున్నాయి.

ఇదేమి చోద్యం..!

నల్లమాడ: కురుమాల గ్రామానికి చెందిన ఎం.శంకర, కేసీ రమణప్ప, చిన్న ఓబులప్ప, శేషాద్రి, చిన్నబాషా ఆదివారం మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. ఇది చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. కారణం ఏమిటంటే వీరిలో శంకర మినహా తక్కినవారు మొదటినుంచి టీడీపీ వారే కావడం గమనార్హం. శంకర కాంగ్రె సానుభూతిపరుడిగా గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. చిన్న ఓబులప్ప టీడీపీ హయాంలో ఎంపీటీసీగా పనిచేశారు. మరో నాయకుడు చిన్నబాషా 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కురుమాల పంచాయతీ ప్రస్తుత వైఎస్సార్ సీపీ సర్పంచ్ లింగమూర్తిపై టీడీపీ మద్దతుతో పోటీచేసి ఓటమి పాలయ్యారు. చిన్నబాషా భార్య గతంలో టీడీపీ తరఫున ఎంపీటీసీగా పనిచేశారు. దశాబ్దాల తరబడిగా టీడీపీలో కొనసాగుతున్న వారికే తిరిగి కండువాలు వేసి వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరారని చెప్పుకోవడం ఎక్కడి చోద్యమని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



గిరిజనులకు హోళీ శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

గాండ్లపెంట: మండలంలోని 11 గిరిజన తండాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజనులకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి రాబోయే సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్‌అహ్మద్, పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ 'ఫ్యాన్' గుర్తుకు ఓటేయాలని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌హన్‌రెడ్డిని చేసుకుందామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, బీసీ కన్వీనర్ లక్ష్మీనరసింహాగౌడ్, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, సచివాలయ కన్వీనర్ ఖాజావలీ, ఉత్తన్న, ప్రతాపరెడ్డి, గిరిజన నాయకులు గోపాల్‌నాయక్, బాలకృష్ణానాయక్, ఆంజనేయులునాయక్, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: రౌడీషీటర్లు చిన్నపాటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రౌడీషీటర్లు ఎక్కడైనా, ఏ ప్రాంతంలోనైనా గొడవలు పడినా, గొడవలు సృష్టించేందుకు కారకులైనా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారిపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఎవరూ గొడవలకు పాల్పడరాదని సూచించారు. ఇదిలా ఉండగా పట్టణంలోని టీ కేఫ్‌లు, ధాబాలు, హోటళ్లలో తనిఖీలు చేశామని సీఐలు తెలిపారు. టీ కేఫ్‌లలో ఎక్కువ మంది ప్రజలు కూర్చుని టీలు తాగుతూ మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు జరిగే ప్రమాదముందని అందుకే టీ కేఫ్‌లలో ఎక్కువ మంది కూర్చోకుండా చూసుకోవాలని యజమానులను ఆదేశించామని తెలిపారు.

నాటుసారా ఊట ధ్వంసం



నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ శ్రీధర్, సిబ్బంది

ఎన్పీకుంట: నల్లగుట్టపల్లితాండా పరిసర ప్రాంతంలో పోలీసులు సుమారు 200 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. ఆదివారం పోలీసులు నల్లగుట్టపల్లితాండాలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సామగ్రిని గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం ఎస్‌ఐ కె.శ్రీధర్ తెలిపారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలో ఎవరూ నాటుసారా తయారు చేయరాదని, అమ్మరాదని హెచ్చరించారు.

నల్లమాడ: వంకరకుంట పంచాయతీ బసిరెడ్డిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు తయారీ కోసం గుర్తుతెలియని వ్యక్తులు నిల్వ ఉంచిన 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. నల్లమాడ పోలీస్ సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు ఆదివారం తమ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి వంకరకుంట గ్రామ పరిసర ప్రాంతాల్లో నాకా బందీ నిర్వహించారు. అదే గ్రామంలో నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు లీటర్ల చొప్పున సారా స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వంకరకుంట, బసిరెడ్డిపల్లి గ్రామాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కళింగర కాయలకు డిమాండ్



గోకులంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కళింగరకాయలు

పుట్టపర్తి టౌన్: భానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పలు మార్గాలను ఆశ్రయిస్తున్నారు. ఈక్రమంలో కళింగర కాయలకు డిమాండ్ పెరిగింది. ఇతర రాష్ట్రాల్లో పండించిన కళింగరను వ్యాపారులు కొనుగోలు చేసి పట్టణంలో విక్రయిస్తున్నారు. పట్టణంలో గోకులం ఆర్చ్ వద్ద నుంచి విద్యాగిరి ఆర్చ్ వరకు కళంగిర కాయల విక్రయాలు సాగుతున్నాయి. ఈసారి పంట దిగుబడి తక్కువగా ఉండడంతో కళింగరను కర్ణాటక నుంచి తేవాల్సి వస్తోందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రజల సౌకర్యార్థం వాటిని ముక్కలు చేసి ప్లేట్ల ప్రకారం విక్రయిస్తున్నారు. గతంలో పోల్చితే పంటలు దిగుబడి తక్కువ ఉన్నందున ధరలు మండుతున్నాయి. గతంలో కళింగర కాయ రూ.30కే ఇచ్చేవారు. ఈసారి రూ.50 నుంచి రూ.100 పెడితే కానీ మంచి కాయ లభించడం లేదు.

మోటారు ఏర్పాటుకు ఆర్థికసాయం

పుట్టపర్తి: బుక్కపట్నం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల(కేజీబీవీ)లో తాగునీటి బోరు మోటారు కోసం రూరల్ అగ్రికల్చర్, డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి రూ.40 వేల ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు ఆదివారం సొసైటీ సభ్యుడు తలమర్ల సంజీవరెడ్డి సిబ్బందికి నగదు అందజేశారు. ప్రభుత్వం గతంలో బోరు వేయించిందని, ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో మోటారు ఏర్పాటు చేయలేక పోయిందని సంస్థ తరఫున మదన్‌మోహన్‌రెడ్డి ఆర్థికసాయం అందించారని ఈ సందర్భంగా సంజీవరెడ్డి పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక తాతయ్య దర్గా



శ్రీరంగరాజుపల్లిలో తాతయ్య స్వామి సమాధి



తాతయ్యస్వామి దర్గా

- నేడు గంధం ఉత్సవం

పరిగి: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న పరిగి మండల పరిధిలోని శ్రీరంగరాజుపల్లి జయమంగళీ నది తీరాన ఉన్న తాతయ్య దర్గాలో సోమవారం గంధం ఉత్సవం జరగనుంది. ప్రతి యేటా హోలీని పురస్కరించుకుని ఇక్కడ మూడు రోజుల పాటు ఉరుసు మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈసారి ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అధికారుల ఆదేశాల మేరకు గంధం ఊరేగింపు మాత్రమే నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తాతయ్య స్వామి చరిత్ర ఇలా...

తాతయ్య స్వామిగా పిలువబడుతున్న స్వామి అసలు పేరు హజరత్ సయ్యద్ షేక్ బుడేన్‌షా ఖాదరి వలీ. కర్ణాటక రాష్ట్రం రామ్‌నగర్ జిల్లాలోని బిడిది అనే గ్రామానికి చెందిన తాతయ్య చిన్న నాటి నుండే ఆధ్యాత్మిక చింతనతో మెలిగేవారు. తన పదో యేట నుంచే సొంత ఊరిని వదిలి వివిధ ప్రాంతాలలో తిరుగుతూ ఆధ్యాత్మిక బోధనలు చేశారు. చివరి దశలో తన పూర్వికుల స్వగ్రామం శ్రీరంగరాజుపల్లికి చేరారు. తన ఆధ్యాత్మిక బోధనలతో పాటు మహిమలను భక్తులకు చూపేవారు. ఆయన తన 90వ యేట 1965లో నిర్యాణం పొందారు. నాటి నుంచి ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజున గ్రామస్తులు దర్గా వద్ద పెద్ద రాత్రంతా భజనలు నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి

దర్గా ఉరుసు (తాతయ్య పరుష) ఉత్సవాలు గ్రామస్తులు, దర్గా వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. సోమవారం రాత్రి 10 గంటలకు గంధోత్సవం జరుగుతుంది. నృత్యాలతో, వీరగాసేల విన్యాసాలతో విద్యుత్ దీపాలంకరణ చేసిన వెండి రథంపై గంధాన్ని ఊరేగిస్తారు. మంగళవారం ఉదయం నుంచే రోజంతా అన్నదానం నిర్వహిస్తారు.

నేడు కదిరి పౌర్ణమి వేడుకలు

కొత్తచెరువు: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం కదిరి పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పాత ఆంధ్రాబ్యాంకు వెనుక ఉన్న ఆలయంలో ఉదయం 6 గంటలకు అభిషేకం, 10 గంటలకు లక్ష్మీ నరసింహ స్వామి గోవింద నామస్మరణతో దాసంగ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు స్వామి గ్రామోత్సవం ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

తలనీలాల ద్వారా రూ.1.53 కోట్ల ఆదాయం

కదిరి టౌన్: తలనీలాల సేకరణకు సంబంధించి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.1.53 కోట్ల ఆదాయం లభించింది. ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను ఏడాది పాటు సేకరించే హక్కు కోసం ఆలయ అధికారులు సీల్డ్ టెండర్ నిర్వహించారు. ఆదివారం టెండర్లు తెరవగా ఇద్దరు టెండర్ షెడ్యూల్ దాఖలు చేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కెవీఎస్ ఎంటర్ ప్రైజస్ వారు అత్యధికంగా రూ.1,53,99,999 కోట్ చేసి టెండర్ దక్కించుకున్నారని ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. తలనీలాల వేలం పాటను ఏడుసార్లు వాయిదా వేశామని, ప్రస్తుతం వేలం ప్రక్రియ పూర్తయిందన్నారు. గతం కంటే ఈసారి తలనీలాల వేలం ఆదాయం తగ్గిందన్నారు.



కర్ణాటక నాగేపల్లిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఘనంగా మట్టల ఆరాధన

పుట్టపర్తి టౌన్: కర్ణాటక నాగేపల్లిలో కింగ్స్ చర్చి పాస్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆరాధనను నిర్వహించారు. మొదటగా చర్చిలో ఏసుక్రీస్తు పాటలను ఆలపించడంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈత మట్టలను పట్టుకొని ఏసు గీతాలను ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ప్రార్థనలు చేసి ప్రజలకు మట్టల ఆదివారంపై తెలియజేశారు.

కల్యాణం..కమనీయం

చిలమత్తూరు: మండల కేంద్రంలో లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటల నుంచి సంప్రదాయబద్ధంగా అర్చకులు స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు కల్యాణాన్ని చూసి తరించారు. అనంతరం స్వామి వారు గరుడ వాహనంలో పుర వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్షయ రహిత సమాజానికి కృషి చేద్దాం







ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, టీబీ యూనిట్ సిబ్బంది, విద్యార్థినులు , కదిరిలో వైద్య సిబ్బంది ర్యాలీ, ఓడీచెరువులో ..

ధర్మవరం అర్బన్: క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వైద్యులు పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ క్షయ అంటు వ్యాధని దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, క్షయ క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, గల్ల, బరువు తగ్గుట, ఆకలి, ఉమ్మిలో రక్తం పడటం ఇలాంటి లక్షణాలు కనబడితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలని తెలిపారు. టీబీ యూనిట్ సిబ్బంది కిష్టప్ప, రహమత్‌బాషా, చంద్రకళ, ఎరుకలప్ప, ల్యాబ్ టెక్నీషియన్ జయమ్మ, బాలాజీనాయక్, బత్తలపల్లి ఆర్డీటీ విద్యార్థినులు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా కదిరి ఏరియా ఆస్పత్రి లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి టవర్‌క్లాక్,మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎస్‌వీకెన్ అండ్ టీబీ టాబ్లెట్స్ అనే నినాదంతో ముందుకు సాగాలని 2025కు టీబీని నిర్మూలించాలని తెలిపారు.డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేంద్రనాయక్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ శిరీష, టీబీ హెచ్‌వీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది మండలకేంద్రంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ భానుప్రకాశ్, డాక్టర్ కమల్ రోహిత్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

గాండ్లపెంట: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు మహేశ్వర మారుతి, బాబాఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మహేశ్వరమారుతి మాట్లాడుతూ 2025 నాటికి క్షయను నివారిస్తామన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీలో సూపర్‌వైజర్లు ఉపేంద్రారెడ్డి, విజయ్‌కుమార్, అక్కయ్య, సోషల్‌వర్కర్ శమంతకమణి, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా దర్శనమల గ్రామంలో ఆదివారం డాక్టర్ పుష్ప ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 2025కల్లా టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్‌రెడ్డి, రహమత్‌బాషా, ఆరోగ్య కార్యకర్తలు ఆంజనేయులు, బ్రహ్మానందరెడ్డి, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచుకు గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి సర్పంచ్ రంగనాథ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం ఆయన రేకులకుంటకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం రంగనాథ్ వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో సర్పంచ్ రంగనాథ్‌కు స్వల్పంగా గాయపడగా మడకశిర ఆస్పత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మూర్తి, తిమ్మప్ప, మంజునాథ్, నాగేంద్రయాదవ్, నాగభూషణరెడ్డి, నరేష్‌రెడ్డి చికిత్స పొందుతున్న రంగనాథ్‌ను పరామర్శించారు.